క్లుప్తంగా

వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్ట



గుంటూరు రూరల్: 40వ డివిజన్ పరిధిలోని స్వర్ణాంధ్రనగర్‌లో శ్రీ కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్టను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో స్వర్ణాంధ్రనగర్, జన్మభూమి కాలనీలు సర్వాంగ సుందరంగా తయారయ్యాయని తెలిపారు. రోడ్లు, సీసీ డ్రైయిన్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఏర్పడటంతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని చెప్పారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాల్ని సమర్పించారు. దేవాలయ చైర్మన్, స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 250 పరీక్షలు



గుంటూరు రూరల్: శరీరంలో కళ్లు ప్రధానమైనవని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్షురాలు పి. దుర్గావాణి తెలిపారు. 40వ డివిజన్ పెదపలకలూరులోని చైతన్య పబ్లిక్ స్కూలులో శుక్రవారం సుదర్శకన్ కంటి ఆసుపత్రి సహకారంతో క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గావాణి మాట్లాడుతూ కంటి వ్యాధులపై అశ్రద్ధ చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని 250 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, చైతన్య, అనిత, టి. లక్ష్మారెడ్డి, పి.కోటేశ్వరరావు, కె. భాస్కరరావు, అహ్మద్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా పునఃప్రతిష్ట మహోత్సవం



పెదనందిపాడు:మండలంలోని పాలపర్రులో శుక్రవారం ఉదయం శ్రీగంగా చతుర్భుజ అన్నపూర్ణాదేవి సమేత సూర్యేశ్వరస్వామి, శ్రీ గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయాల్లో విగ్రహ పునఃప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. బ్రహ్మశ్రీ కొండకావూరి నాగభోగేశ్వర శర్మ, రామకృష్ణశర్మ పర్యవేక్షణలో విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలంకరణలో సుందరంగా అలంకరించారు. పూజల్లో శాసనమండలి సభ్యుడు డొక్కా మాణిక్య వరప్రసాదు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. దాతలు, గ్రామస్తులు సహకారంతో 20 వేల మందికి అన్నదానం నిర్వహించారు.

రైతులంతా అప్రమత్తంగా ఉండాలి

కాకుమాను:గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలపై రైతులంతా అప్రమత్తంగా ఉండాలని ఏవో కె.కిరణ్మయి శుక్రవారం సూచించారు. వర్షాలకు గ్రామాల్లో దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న పంటల వివరాల్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 480 హెక్టార్లలో జొన్న, 530 హెక్టార్లలో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు ఆమె పేర్కొన్నారు. మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మండలం మామిళ్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మూడు గ్రామాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఎం. వెంకటనారాయణ తెలిపారు. మామిళ్లపల్లి సబ్ స్టేషన్‌లోని 33కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా దండమూడి, మామిళ్లపల్లి, వెల్లలూరు ఫీడర్ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో నరసింహ జయంతి

చేబ్రోలు: స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం నరసింహ జయంతి ఘనంగా నిర్వహించారు. వైశాఖ మాస చతుర్దశి సందర్భంగా జ్వాలా లక్ష్మీ నరసింహ కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు.కల్యాణ మూర్తులు ప్రత్యేక అలంకారంలో గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని, పూజలు చేశారు.

కనుల పండువగా భావదేవుని రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్త జనసందోహం



పాల్గొన్న ఎమ్మెల్యే, నేతలు

- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రత్యేక పూజలు

పొన్నూరు(చేబ్రోలు): చారిత్రక ప్రసిద్ధి గాంచిన పొన్నూరులోని సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణస్వామి దివ్య రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. గరుడ వాహనంపై స్వామి పుర వీధుల్లో భక్తులకు దర్శనిమిచ్చారు.

తొలుత వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. రమణమ్మ పర్యవేక్షించారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రారంభం నుంచి రథం రథశాలకు తిరిగి వచ్చే ఆయన భక్తులతో కలసి ఉత్సాహంగా పాల్గొన్నారు.

కిక్కిరిసిన ప్రధాన రహదారులు

పొన్నూరు తిరునాళ్ల సందర్భంగా ప్రధాన రహదారులు జనంతో కిక్కిరిశాయి. ఆలయ ప్రాంగణంతో పాటు జీబీసీ రహదారికి ఇరువైపులా రంగుల రాట్నాలు, చిన్నారుల ఆటల వస్తువులు, బొమ్మల దుకాణాలతో కోలాహలం నెలకొంది. రథోత్సవాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతలు మజ్జిగ, తాగునీరు, ప్రసాదాలను పంపిణీ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. తెనాలి డీఎస్పీ స్రవంతిరాయ్ పర్యవేక్షించారు. రథోత్సవం సమస్యలు లేకుండా సజావుగా జరగడంతో పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన వేళాంగిణి మాత తిరునాళ్ల

- చివరి రోజు బిషప్ భాగ్యయ్య ప్రత్యేక ప్రార్థనలు
- వేలాది సంఖ్యలో పాల్గొన్న భక్తులు



భక్తులకు వాక్యోపదేశం చేస్తున్న గుంటూరు పీఠాధిపతి భాగ్యయ్య

పెదనందిపాడు: లోక రక్షణార్థమై మరియమాత త్యాగాల్ని గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య భక్తులకు ఉద్బోధించారు. మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో వేళాంగిణి మాత తిరునాళ్ల ముగింపు రోజు శుక్రవారం రాత్రి బిషప్ భాగ్యయ్య భక్తుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేళాంగిణి మాత పుణ్యకార్యాల గురించి ప్రజలకు తెలియజేశారు. కన్యగా ఉన్న మరియమాత లోక రక్షకుడు అయిన యేసు ప్రభువునకు జన్మనిచ్చినట్లు తెలిపారు. లోక రక్షణకు ఆమె మొట్టమొదటిగా దేవుని వాక్యాన్ని క్రీస్తు రూపంలో లోకానికి అందించారని పేర్కొన్నారు. అత్యంత ముఖ్యమైన తన కుమారుడ్ని లోక పాపాల్ని పరిహరించడానికి త్యాగం చేశారని కొనియాడారు. దేవుని మాటల్ని తూచా తప్పకుండా పాటించి, లోక రక్షణకు ఆయన తనకిచ్చిన బాధ్యతను నేరవేర్చారని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతల్ని సక్రమంగా పాటిస్తూ, దేశంలో శాంతి, సమాధానాల్ని వెదజల్లాలని ఆయన ప్రజలకు తెలిపారు.కార్యక్రమంలో విచారణ గురువు ఎం.రాజు, గుంటూరు మేత్రాసన బ్రదర్స్, సిస్టర్స్ పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



పెదకాకాని: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని రాష్ట్ర సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి తెలిపారు. నంబూరు ఐజేఎం రెయిన్ ట్రీ పార్కులో శుక్రవారం షాన్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ఏ విధంగా ప్రాధాన్యత ఇస్తుందో, అదే విధంగా సంగీత, నృత్య కళలకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో సంగీత, నృత్య ఉపాధ్యాయుల్ని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఐజేఎం ప్రాజెక్ట్ మేనేజర్ బిపిన్ కుమార్ మిశ్రా, అకాడమీ మేనేజర్ శ్యామ్యూల్ మణి పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మహిళా పోలీసులతో సమావేశమైన అడిషనల్ క్రైం ఎస్పీ శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మహిళల్ని చైతన్యపరుస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గుంటూరు అడిషనల్ క్రైం ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. అడవితక్కెళ్లపాడులోని నల్లపాడుపోలీసు స్టేషన్‌లో శుక్రవారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలపాలని సూచించారు. జూదం, కోడి పందేలపై నిఘా పెట్టాలని చెప్పారు. సచివాలయం పరిధిలో సమస్యల్ని ఎప్పటికప్పుడు సిబ్బంది దృష్టికి తేవాలని తెలిపారు. కార్యక్రమంలో సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషా, నల్లపాడు సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు భేష్

ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మెట్టు రాజేశ్వరి

గుంటూరు రూరల్: రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం గొప్ప కార్యక్రమమని ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మెట్టు రాజేశ్వరి పేర్కొన్నారు. ప్రత్తిపాడులోని ఆమె కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించడం పేదలకు వరమని తెలిపారు. అటువంటి గొప్ప కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని చెప్పడం హేయమైన చర్య అని ఆమె ఖండించారు. టీడీపీకి పేదలంటే గౌరవం లేదని తెలిపారు. స్వయంగా చంద్రబాబు, అచ్చెంనాయుడు స్థలాల గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం బాధకరమని రాజేశ్వరి ఖండించారు. పేదలకు వారు ప్రత్యక్షంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

గ్రాండ్ నాగార్జున హోటల్ పునఃప్రారంభం



హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: కోణార్క్ హోటల్ నూతన యాజమాన్యంలో హోటల్ గ్రాండ్ నాగార్జున హోటల్ శుక్రవారం పునః ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మేయర్ కావటి మనోహర్ నాయుడు, టీడీపీ సీనియర్ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, పారిశ్రామికవేత్త తులసి ధర్మచరణ్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ పాల్గొన్నారు. చైర్మన్ ఎలవర్తి నాగరాజు మాట్లాడుతూ హోటల్‌లో ఫ్యామిలీ రెస్టారెంట్, ఫంక్షన్ హాల్స్, కాన్ఫరెన్స్ మీటింగ్ హాల్స్, సూట్ రూమ్స్ ఉన్నాయని తెలిపారు.అత్యాధునిక ఇంటీరియర్ డిజైన్‌తో, ఆహ్లాదకరమైన వాతావరణంలో నార్త్ ఇండియన్, చైనీస్, ఆంధ్ర స్పెషల్, వివిధ రకాల వెజ్, నాన్ వెజ్ వంటకాల్ని అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పెదకాకాని: కంతేరు అడ్డ రోడ్డు సమీపంలో జాతీయ రహదారి సెంట్రల్ డివైడర్‌పై మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. నాలుగు రోజుల కిందట మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని అమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

10,11వ తేదీల్లో ఇంపాక్ట్ మెగా ఈవెంట్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ, మట్టుపల్లి మోహన్, చల్లా రవి, ఆరుద్ర తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 10,11వ తేదీల్లో నిర్వహిస్తున్న ఇంపాక్ట్ మెగా ఈవెంట్‌కు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులతో పాటు వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతున్నట్లు మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమ పోస్టర్లను విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.వి. లక్ష్మీనారాయణ, ఇంపాక్ట్ గుంటూరు ఇన్‌చార్జ్ చల్లా రవి, డాక్టర్ యద్దనపూడి ఆరుద్రతో కలసి ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వరరావు నేతృత్వంలో వ్యక్తిత్వ వికాసం, సామాన్యుల జీవితాల్ని మార్చే దిశగా అద్భుతమైన మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 1,500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, వ్యాపారవేత్తలతో పాటు అనేక రంగాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్న ఈ మహాయజ్ఞం ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9494466389 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు. పేర్లను htt pr://-f-am pa.i n/e-ve nt నమోదు చేసుకోవాలని తెలిపారు. మెగా ఈవెంట్‌కు హాజరు కానున్న మోటివేటర్స్‌లో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, యోగా గురువు జగన్ గురూజీ, సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత, ఆకెళ్ల రాఘవేంద్రరావు, గ్రంధి కాంతారావు, బాలలత, వేణుగోపాల్, ఆర్‌టీఎస్ కృష్ణ ప్రభు, ప్రదీప్ కంపర్తి, శ్రీపాద రామ్, వేణుకళ్యాణ్ తదితరులు ఉన్నారని వివరించారు.

బాలికకు అరుదైన శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కృష్ణ స్రవంత్

గుంటూరు ఈస్ట్: ప్రమాదంలో గాయపడిన బాలికకు అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కృష్ణ స్రవంత్ చెప్పారు. ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన ఏడు సంవత్సరాల జ్ఞానలక్ష్మి ఏప్రిల్ 22న ప్రమాదవశాత్తు గాయపడింది. ముఖం, కండరాలు, ఎముకలు నుజ్జునుజ్జు అయ్యాయి. ముఖం మొత్తం ఏకమైపోయింది. కుడికన్ను పక్కకు జరిగింది. బాలిక తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకు రాగా, ప్రాథమిక పరీక్షలు చేశారు. ఆరుగురు వైద్యుల బృందం ఎనిమిది గంటలపాటు అరుదైన సర్జరీ చేశారు. కంటిచూపు దెబ్బతినకుండా, ముఖం రూపు యథావిధిగా వచ్చేలా విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించినట్లు డాక్టర్ కృష్ణ స్రవంత్ వివరించారు. బాలిక తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డాక్టర్ అమూల్య, డాక్టర్ కళ్యాణ్, మత్తు వైద్యురాలు ఎస్.శిరీష, వైద్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ, రుద్ర హోమాలు



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆలయ ధార్మిక ప్రాంగణంలోని యాగశాలలో పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణం కాంక్షిస్తూ శుక్రవారం గణపతి, చండీ, రుద్ర హోమాల్ని నిర్వహించారు. భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో రుత్వికులు వేదమంత్రాల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, పాలకవర్గ సభ్యులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. తొలుత ప్రాంగణంలోని శివలింగానికి విశేష అభిషేకార్చనలు జరిపారు.

నష్టపోయిన ప్రతి రైతుని ఆదుకుంటాం



లింగంగుంటపాలెంలో తడిసిన జొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

లింగంగుంటపాలెం(కాకుమాను): ఇటీవల భారీ వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుని ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. మండలంలోని లింగంగుంటపాలెంలో దెబ్బతిన్న పంటల్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల్ని నష్టపోయిన రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రతి రైతునీ గుర్తించి త్వరలోనే ప్రభుత్వం నష్టపరిహారం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. మరో మూడు రోజుల పాటు వాతావరణ శాఖ అధికారులు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని ప్రకటించిన దృష్ట్యా కల్లాల్లో ఉన్న జొన్న, మొక్కజొన్న గింజలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. సాధ్యమైనంత వరకు పంట ఇళ్లకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఏఓ నున్న వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ విధానాలతో యువతకు ఉపాధి



వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ గోపాల్

గుంటూరు రూరల్ (వట్టిచెరుకూరు): ఆధునిక వ్యవసాయ విధానాలతో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్. గోపాల్ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో శుక్రవారం సేంద్రియ వ్యవసాయం, కషాయాల తయారీపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో పెరిగిన పెట్టుబడులు రైతులకు ప్రధాన సమస్యగా మారి, వ్యవసాయం గిట్టుబాటు అవ్వడంలేదని చెప్పారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని విడిచిపెట్టి సేంద్రియ వ్యవసాయాన్ని అవలంబించాలని సూచించారు. సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలతో భూమి ఆరోగ్యంతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని చెప్పారు. అనంతర నిరుద్యోగులకు పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకం, సేంద్రియ కషాయాలు, చెక్క గానుగ ద్వారా నూనె తయారీ తదితర విషయాల్ని వివరించారు. సేంద్రియ సాగుపై రైతులకు శిక్షణతో పాటు సహకారాన్ని అందిస్తున్న రైతు నేస్తం ఫౌండేషన్‌ను అభినందించారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్పీ రామారావు

కాకుమాను:మండలంలోని గ్రామాల్లో శనివారం నుంచి గత ఏడాది నిర్వహించిన ఉపాధి పనులపై నిర్వహించనున్న సామాజిక తనిఖీకి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని ఎంపీడీవో కె.శరత్‌బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో గత ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5.84 కోట్ల పనులు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.1.10 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సభ్యులు తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో సభ్యులకు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచ్ శివకుమారి, ఎస్సార్పీలు రామారావు, రాజు, ఏపీవో సింగారావు, వివిధ గ్రామాల సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

సజ్జలను కలసిన ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నాయకులు



గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రెడ్ల సమస్యలపై సజ్జలతో చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాల్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సజ్జల సానుకూలంగా స్పందించారని నరేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం రెడ్లకు, ఇతర ఓసీ వర్గాలకు ఉపయోగపడే విధంగా మంచి కార్యక్రమాలను తీసుకొస్తామని తెలిపారన్నారు. ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం చేస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకొని వ్యవస్థాపక అధ్యక్షుడిని, కమిటీ సభ్యుల్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటరెడ్డి, మహిళా విభాగం కార్యదర్శి పులుగు సుశీలరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతిరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సాయికుమార్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి విద్యార్థులకు ఆదివారం నుంచి ఉచిత ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) కన్వీనర్ కె.సాయికుమార్ తెలిపారు. శ్యామలానగర్‌లోని తన నివాసంలో శుక్రవారం శిక్షణ తరగతుల పోస్టర్లను ఎమ్మెల్సీ లక్ష్మణరావు విడుదల చేశారు. బ్రాడీపేట 2వ లైనులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సాయంత్రం 6.00 గంటల నుంచి 8.00 గంటల వరకు 10 రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో సబ్జెక్టు నిపుణులతో పాటు ఉన్నతాధికారులు తరగతుల్ని బోధిస్తారని ఆయన పేర్కొన్నారు. పేర్లను నమోదు చేసుకునేందుకు 91215 14792, 72075 66702, 94939 06174 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ధర్మ మొబైల్ హెల్త్ వెహికల్ ప్రారంభం



వెహికల్‌ను ప్రారంభిస్తున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ అండ్ వేల్ఫేర్ డైరెక్టర్ రామిరెడ్డి

పెదనందిపాడు: గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ మొబైల్ హెల్త్ వెహికల్‌ను ప్రారంభించడం అభినందనీయమని హెల్త్ అండ్ ఫ్యామిలీ అండ్ వేల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ వి. రామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పాలపర్రులో శుక్రవారం ఉదయం శారద సర్వీస్ సొసైటీ తెనాలి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్మ మొబైల్ హెల్త్ వెహికల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ మొబైల్ వ్యాన్‌లోనే బీపీ, ఈసీజీతో పాటు ఇతర స్కానింగ్ పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామస్తులు వీటిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎ. శ్రావణ్‌బాబు, తెనాలి డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, శారద సర్వీస్ సొసైటీ సభ్యురాలు శారద, గ్రామస్తులు పాల్గొన్నారు.